
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్టం 42.4 | కనిష్టం 31.6
5
కామారెడ్డి
జిల్లా వార్తలు
సోమవారం 29 ఏప్రిల్ 2024



2వ తేదీ లోపు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి


కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28: ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహించే సప్లిమెంటరీ పరీక్ష ఫీజును వచ్చేనెల 2 వరకు చెల్లించాలని ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం తెలిపారు. వచ్చేనెల 24 నుంచి జూన్ 1 వరకు సప్లమెంటరీ పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 7 వరకు నిర్వహిస్తామని, ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు జూన్ 11న, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ 12న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒకవేళ పరీక్ష తేదీల్లో మార్పులు సైతం ఉండవచ్చని వివరించారు.



జర.. తప్పుకోండి!

కామారెడ్డి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలుపు కోసం అన్ని పార్టీల నేతలు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఏ ఒక్క చిన్న విషయాన్ని వదలకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి 40 మంది నామినేషన్ల దాఖలు చేశారు. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం పూర్తయింది. రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను పరిశీలించి పార్లమెంట్ పరిధిలో 14మంది అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. 26 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నామినేషన్‌లు వేసిన అభ్యర్థులను ఉప సంహరించుకోవాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలు మంతనాలు జరుపుతున్నారు.

బరిలో 26 మంది అభ్యర్థులు



జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్‌లు స్వీకరించగా మొత్తం 40 మంది అభ్యర్థులు 68 నామినేషన్ల సెట్లను దాఖలు చేశారు. ఇటీవల నామినేషన్‌ల పరిశీలన విషయంలో 14 మంది అభ్యర్థులకు సంబంధించి 18 నామినేషన్‌లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. దీంతో 26 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఉప సంహరణ నాటికి ఎంత మంది ఉంటారో తేలాల్సి ఉంది.

- నామినేషన్ల ఉప సంహరణకు ప్రయత్నాలు
- ఇప్పటికే బుజ్జగింపులు ప్రారంభించిన అభ్యర్థులు
- జహీరాబాద్ పరిధిలో 40 నామినేషన్ల దాఖలు
- పరిశీలనలో 14 నామినేషన్ల తిరస్కరణ
- బరిలో 26 మంది అభ్యర్థులు
- నేడు నామినేషన్ల ఉప సంహరణకు చివరి రోజు
- 15కు మించితే రెండు ఈవీఎంలు
- నామినేషన్ల ఉప సంహరణ కోసం అభ్యర్థులతో నేతల మంతనాలు

బూత్‌కు రెండు ఈవీఎంలు అవసరం

జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి 26 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో నామినేషన్‌ల ఉప సంహరణ అనంతరం 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒక్క ఈవీఎంలో 15 మంది పేర్లకు అవకాశం ఉండగా నాడు ఒకే ఈవీఎం సరిపోయింది. ఈసారి మాత్రం 40 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా 14 మంది నామినేషన్‌లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 26 మంది అభ్యర్థుల్లో ఎంత మంది ఉప సంహరించుకుంటారో సోమవారం తేలనుంది. ఒకవేళ ఉప సంహరణ అనంతరం కూడా 15 మందికి పైగా అభ్యర్థులు బరిలో నిలిస్తే రెండు ఈవీఎంలు అవసరం పడతాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో రెండేసీ ఈవీఎంల చొప్పున ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పోలింగ్ రోజు ఓటర్లు తికమక పడే అవకాశం ఉంది. అలాగే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు వివరించడంలో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు ఉండేలా తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేషన్‌లు వేసిన అభ్యర్థులు వారితో సన్నిహితంగా ఉండేవారితో రాయబేరాలు కొనసాగిస్తున్నారు.

ఉప సంహరణకు ప్రయత్నాలు

నామినేషన్‌ల ఉప సంహరణకు సోమవారంతో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలో నుంచి స్వతంత్రులుగా పోటీ చేసిన అభ్యర్థులతో కొందరు మంతనాలు సాగిస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక్క ఈవీఎంలో 16 గుర్తులు ఉండగా అందులో చివరిది నోటాకు కేటాయిస్తారు. పోటీలో 15 మందికి మించితే రెండో ఈవీఎం ఉపయోగించాల్సి ఉంటుంది. జహీరాబాద్ ఎంపీ స్థానంలో 26 మంది బరిలో ఉండగా ఇందులో 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉప సంహరించుకోవాల్సి ఉంటుంది. దీంతో వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనేతలు స్వతంత్ర అభ్యర్థులకు తాయిలాలు చూపి పోటీ నుంచి తప్పుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో నేడు తేలనుంది.



పోలీసు పరిశీలకుడిగా రాజేష్ మీనా



మొక్కను అందజేస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28: జహీరాబాద్, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పోలీసు పరిశీలకునిగా రాజేష్‌మీనా నియామకం అయ్యారు. ఆదివారం ఎస్పీ సింధూశర్మ ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలు కాపాడడానికి ఎక్కడ కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడడానికి పటిష్ట పోలీస్ భద్రత, తనిఖీలు ప్రతిరోజూ నిర్వహించడం జరుగుతుందని ఆయనకు వివరించారు. ఓటర్లను ప్రలోభ పరిచే చర్యలను నిరోధించేందుకు జిల్లా సరిహద్దుల్లో రెండు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామని వివరించారు. పోలీసు సిబ్బందితో పాటు ఒక కంపెనీ పారా మిలటరీ బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహింపచేశామని తెలిపారు. ఇప్పటి వరకు పాత నేరస్తులు, రౌడీషీట్‌లు కలిగి ఉన్న 493 మందిని బైండోవర్ చేశామని, లైసెన్స్‌లు కలిగి ఉన్న వ్యక్తుల వద్ద నుంచి 19 ఆయుధాలను డిపాజిట్ చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, టౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ రామన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందాలి

జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తుగా అనుమతి పొందిన వాటినే ప్రసారం, ముద్రణ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.చానళ్లలో ప్రసారాలకు,ప్రింట్ మీడియాలోప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందకుండా ప్రచురించడం, ప్రసారం చేయడం ఎన్నికల నియామవళి ఉల్లంఘనకు వస్తుందని, అట్టి ఖర్చును అభ్యర్థి పేర చూపించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థి పేర వారి అనుచరులు ఖర్చుచేసిన అట్టి ఖర్చు అభ్యర్థి ఖాతాలో చూయించడం జరుగుతుందని, ఒకవేళ అభ్యర్థి సమ్మతించకుంటే పబ్లిషర్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సామాజిక మాధ్యమాలలో బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మేసేజీలు, సినిమా హాళ్లలో, రేడియోలలో ప్రకటనలకు సంబంధించి ముందస్తుగా అనుమతి పొందాలని సూచించారు. అదేవిధంగా నిబంధనలను అనుసరించి ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటిరియల్ ముద్రించేటప్పుడు తప్పనిసరిగా అనుమతి పొందాలని తెలిపారు.అసత్యవార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వచ్చిన మెస్సేజ్‌లో వాస్తవం గ్రహించి నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. పోలింగ్‌కు రెండురోజుల ముందు సైలెన్స్ పీరియడ్ చాటా కీలకమని న్యూస్ రిపోర్టింగ్‌లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి

- జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లిఖార్జున్‌బాబు

సదాశివనగర్, ఏప్రిల్ 28: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లిఖార్జున్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో కొనసాగుతున్న పలు కేంద్రాలను, సదాశివనగర్‌లో పద్మావతి ఇండస్ట్రీస్ బాయిల్డ్‌రైస్‌మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పుంజుకున్నదని ఇప్పటి వరకు ఒక లక్ష 20వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. కేంద్రం నిర్వాహకులు నాణ్యత ప్రమాణాల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి తూకం చేసిన వెంటనే సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలని అన్నారు. ట్యాబ్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తిచేసి నిర్ధిష్ట గడువులోగా రైతులకు డబ్బు అందించాలని సూచించారు. టోకెన్ వారిగా ధాన్యం కొను గోలు చేయడం జరుగుతుందని రైతులు సంయమనం పాటించా లని తెలిపారు. వృద్ధ రైతులు ధాన్యం కుప్పల వద్ద ఉండవద్దని తెలిపారు. అదేవిధంగా సీఎంఆర్‌ను నిర్ధిష్ట గడువులోగా అందించా లని రైస్‌మిల్ యజమానికి సూచించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

భిక్కనూరు, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన, కలశ స్థాపన, పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాధారణ, తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అంతకుముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ ప్రతినిధులు మేళతాళాల మధ్య ఊరేగించారు.



ఎండ ప్రచండం

- డోంగ్లీలో రికార్డు స్థాయిలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- ఎండవేడిమికి అల్లాడుతున్న జిల్లా ప్రజలు





కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. భానుడు నిప్పులు కురిపిస్తుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గత మూడు రోజులుగా చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. ఆదివారం డోంగ్లీలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్‌లో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతల కంటే నాలుగు డిగ్రీలు అధికంగా నమోదు కావడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. మధ్యాహ్నం పల్లె, పట్టణమనే తేడా లేకుండా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు తలడిల్లుతున్నారు. యాసంగి పంటల కోతలు మొదలుకావడంతో రైతులు, కూలీలు ఎండలో ఇబ్బందులు పడుతున్నారు.

ఆరెంజ్ జోన్‌లోకి 21 గ్రామాలు

జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. 21 గ్రామాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలలోపు నమోదైయితే సాధారణం. 35 నుంచి 40 డిగ్రీలకు చేరుకుంటే జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. 41 నుంచి 46 డిగ్రీలకు చేరుకుంటే అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. 46 డిగ్రీలకు పైబడి నమోదయితే ప్రమాదాల హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో ఎల్లోజోన్ నుంచి ఆరెంజ్ జోన్‌కు చేరువగా ఉన్న ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లకపోవడమే మంచిదని తప్పనిసరి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వచ్చే నెలలో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందనే వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండకు తోడు వేడిగాలులు వీస్తుండడంతో ఇబ్బంది ఉంటుందని చెబుతున్నారు.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలు మండలాల్లో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇందులో డోంగ్లీలో 44 డిగ్రీలు, నిజాంసాగర్ మండలం మక్దుంపూర్‌లో 43.7 డిగ్రీలు, బిచ్కుందలో 43.6, పిట్లంలో 43.4, రామారెడ్డిలో 42.7, నస్రూల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవునిపల్లిలో 42.6, మద్నూర్ మండలం మేనూర్‌లో 42.5, నిజాంసాగర్ మండలం హసన్‌పల్లిలో 42.4, గాంధారి మండలం సర్వాపూర్‌లో 42.3, ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌లో 42.2, పెద్దకొడప్‌గల్‌లో 41.9, పాల్వంచ మండలం ఎల్పుగొండ 41.9, బీబీపేట 41.8, కామారెడ్డి మండలం పాతరాజంపేట 41.8, తాడ్వాయి 41.4, లింగంపేట 41.4, భిక్కనూర్ 41.3, గాంధారి 41.2, బాన్సువాడ మండలం కొల్లూర్ 41.2, రాజంపేట మండలం ఆర్గోండ 41.1, దోమకొండ 41.1, బిచ్కుంద మండలం పుల్కల్ 41.0, నస్రూల్లాబాద్ 40.9, మద్నూర్ మండలం సోమూర్ 40.7, మాచారెడ్డి మండలం లచ్చపేట 40.6, జుక్కల్ 40.5, బీర్కూర్ 40.4, పాల్వంచ 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ విద్యార్థి

సిరికొండ, ఏప్రిల్ 28: సౌత్‌జోన్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ విద్యార్థి సిద్దార్థ ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి 30 వరకు కర్నాటక రాష్ట్రంలోని తుంకూర్ ఆతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున సిద్దార్థ ఆడుతున్నాడు. సిద్దార్థ ఈనెల 18న మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో జరిగిన సెలెక్షన్‌లో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.



వేదికపై 2003-2004 బ్యాచ్ చౌట్‌పల్లి పదోతరగతి విద్యార్థులు

చౌట్‌పల్లిలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 28: మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు 21ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు పాఠశాలలోని తరగతి గదిలో కూర్చొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. కార్యక్రమం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడిపాడుతూ ఆనందంగా గడిపారు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు

● పంట పొలాలకు నల్లమట్టి తరలింపు ● పూడిక మట్టితో ప్రయోజనం చేకూరుతుందంటున్న రైతులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 28: గతంలో వేసవికాలం వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎడ్లబండ్లతో చెరువులోని పూడిక మట్టిని తీసి పంటపొలాలకు వేస్తూ ఖరీఫ్‌కు సిద్ధమయ్యేవారు. రానురాను పశుసంతతి తగ్గిపోవడంతో రైతులు నల్లమట్టిని ట్రాక్టర్‌లు, టిప్పర్‌ల ద్వారా తమపంట పొలాలకు చేరవేస్తున్నారు. నల్లమట్టి వాడకంతో భూములు సారావంతమై నాణ్యమైన పంట పండడమే గాకుండా రసాయనిక ఎరువులు వాడకం, తగ్గి పెట్టుబడులు తగ్గుతాయి. దీంతో చీడపీడల బెడద కూడా తక్కువగా ఉంటుంది. చెరువు పూడిక పంట పొలాలకు వాడడంతో రైతులకు బహుళప్రయోజనాలు ఉన్నాయి. నల్లమట్టి వేయడం వల్ల భూమికి పోషకాలు ఉండి పంటలు సమృద్ధిగా పండుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

● భూసారం పెరుగుతుందంటున్న రైతులు

పంట పొలాలకు నల్లమట్టి వేయడంతో భూసారం పెరుగుతుందని రైతులు చెప్తున్నారు. ఇంతకాలం పంటపొలాల్లో విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడకం ఎక్కువైంది. దీంతో భూమిలో సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోవడంతో భూభౌతిక లక్షణాలు దెబ్బతింటున్నాయి. దీనివల్ల దిగుబడులు రాక రైతులు ఆశించిన స్థాయిలో ప్రయోజనం పొందలేకపోతున్నారు. నల్లమట్టి, ఒండ్రుమట్టి వాడడం వల్ల పంటల చీడపీడల ఆశించకుండా ఉంటాయి.

● భూసార పరీక్షలతో రైతులకు మేలు

రైతులు ప్రతీ సంవత్సరం భూసార పరీక్షలు చేయించుకొని, దానికి అనుగుణంగా పంటలను వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులు, రసాయనిక ఎరువులు, శాస్త్రవేత్తల సూచన మేరకు వాడితే రైతులకు వ్యయం తగ్గి లాభాలు పెరిగే అవకాశం ఉంది.



పంట పొలాల్లో వేసిన నల్లమట్టి

పంటలకు నల్లమట్టి వాడడంతో తేమను నిల్వ ఉంచడమే కాకుండా రోగనిరోధక శక్తి పెరిగి చీడపీడల భారీ నుంచి పంటలను రక్షించవచ్చు.

● చెరువుల్లో పెరుగుతున్న నీటి నిల్వ సామర్థ్యం

గ్రామాల్లో చెరువులకు ప్రాధాన్యత అంతాఇంతా కాదు. చెరువుల ఆధారంగా ఊరు బతికేది. చెరువులో పూడిక పేరుకుపోయి నీటి నిల్వలు తగ్గుతాయి. దీంతో సమీపంలోని వ్యవసాయ బావులకు కూడా భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. నల్లమట్టి పూడిక తీయడంతో చెరువులు, గోదావరి తీరంలోని ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం పెరుగుతోంది. చెరువుల్లో సుమారు 3నుంచి 4అడుగుల వరకే నల్లమట్టి తీయడంతో రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. చెరువుల్లో పూడిక మట్టి తీయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయి. అంతేగాకుండా చెరువుల ఆధారంగా జీవనోపాధి పొందే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.



టిప్పర్ ద్వారా నల్లమట్టిని వేస్తున్న దృశ్యం

పంట దిగుబడులు పెరుగుతాయి..

● రాజవెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

పంటపొలాల్లోకి నల్లమట్టిని చేరవేయడంతో భూమి సారవంతమవడమే కాకుండా పంట దిగుబడులు పెరుగుతాయి. పశువుల పేడ లభించకపోవడంతో నల్లమట్టిపైనే రైతులు ఆధారపడుతున్నారు. ఈ ఏడాది 120 ట్రాక్టర్‌ల నల్లమట్టిని వేయించారు. పంట పొలాలకు నల్లమట్టిని తరలించడం ద్వారా చెరువుల్లో పూడికతీతతో నీటి నిల్వసామర్థ్యం, భూగర్భజలాలు పెరుగుతాయి.



మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

కార్పొరేట్ కంపెనీల కోసం ప్రజాధనం లూటీ చేశారు

● సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుడు బుర్రి ప్రసాద్

పెద్దబజార్, ఏప్రిల్ 28: ప్రభుత్వరంగ సమస్యలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ ప్రజాధనం లూటీ చేశారని సీపీఎం రాష్ట్ర నాయకుడు బుర్రిప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని నాందేవ్‌వాడలోగల సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతోపాటు రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకురావడంతో వందలాది మంది రైతులు తమప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటంచేసి అనేక మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చడం కోసం కార్మికచట్టాల్లో మార్పులు తెచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ప్రైవేటు కంపెనీలో రిజర్వేషన్లు అమలు జరుపకుండా పేద మధ్యతరగతి ప్రజానీకం ఉపాధి అవకాశాలు తగ్గి పేదరికంలో నెట్టివేయబడ్డారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడంతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయని అన్నారు. ప్రజలకు ఉన్న హక్కులను కాలరాసే పద్దతిలో రాజ్యాంగాన్ని మార్చి లౌకిక ప్రజాస్వామ్యానికి నష్టం చేకూర్చేపని చేయాలనుకుంటున్నారని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్‌గౌడ్, గంగాధర్, సిర్పలింగం, కటారి రాములు, అనసూయమ్మ, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

బోధన్‌రూరల్, ఏప్రిల్28: అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ పట్టణ ఎస్సై నాగనాథ్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాచేస్తున్న ఒక ఆటోతో పాటు మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మంజీర పరివాహక ప్రాంతం నుంచి కల్దుర్కి మీదుగా బోధన్ వైపు అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

భూలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్28: పట్టణంలోని మహాలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో సర్వసమాజ్ ప్రజా ఐక్యసమితి ఆధ్వర్యంలో ఆదివారం భూలక్ష్మీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూలక్ష్మీ మాతకు నైవేద్యాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి సభ్యులు ఆకుల రాజు, కార్యదర్శి కర్తన్ దినేష్, మాజీ సర్వ సమాజ్ అధ్యక్షుడు డాన్ మహి, సభ్యులు, ఆయాసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న ఐక్యసమితి సభ్యులు



డిచ్‌పల్లిలో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

డిచ్‌పల్లిలో వాహనాల తనిఖీ

డిచ్‌పల్లి, ఏప్రిల్28: మండలకేంద్రంలో డిచ్‌పల్లి పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. సెల్‌ఫోన్ మాట్లాడుతు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారికి, హెల్మెట్‌లేకుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులకు, జరిమానాలు విధించారు. అల్కహాల్ పరీక్షలు నిర్వహించారు. సరైనపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల ను తగ్గించాలని పోలీసులు కోరారు.

బెల్లాల్ కారోబార్‌కు నోటీసులు

బోధన్‌రూరల్, ఏప్రిల్28: మండలంలోని బెల్లాల్ గ్రామ పంచాయతీ కారోబార్‌కు బోధన్ ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ సంజాయిషి నోటీసు జారీచేశారు. ఆసరా పింఛన్లు పంపిణీ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో కారోబార్‌కు సంజాయిషీ నోటీసులు పంపించామని, మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎవరూ ప్రజల వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేయవద్దని ఆయన సూచించారు.

మతవిద్వేశాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్ర

● సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

పెద్దబజార్, ఏప్రిల్ 28: మతం పేరుతో ప్రజల మధ్య మత విద్వేశాలు రెచ్చగొడుతున్నారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య అన్నారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ గత పది సంవత్సరాల కాలంలో ప్రజలు చెమటోర్చి సంపాదించిన డబ్బును జీఎస్టీ పేరుతో పన్నుల రూపంలో వచ్చిన సంపదను కొద్దిమంది పెట్టుబడిదారులకు కట్టబెడుతూ బడా పెట్టుబడి దారులను వేల కోట్ల రూపాయలు బ్యాంకులో అప్పులు రద్దు చేశారని అన్నారు. ప్రభుత్వ సెక్టర్‌కి సంబంధించిన సమస్యలను ప్రైవేటీకరణ చేస్తున్నారని అన్నారు. ప్రైవేటీకరణలో రిజర్వేషన్లు రద్దు అవుతాయని కిందిస్థాయి ప్రజలకు ఉద్యోగ అవకాశాలు లేకుండాపోతాయని అన్నారు. పార్లమెంట్‌లో 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు శివకుమార్, జల్ల మురళి, మోహన్, శంకర్, రాజు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు



మాట్లాడుతున్న యోగేంద్రయాదవ్

బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే.. సొంత రాజ్యాంగం అమలు

● భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్

పెద్దబజార్, ఏప్రిల్ 28: బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తొలగించి మత విద్వేశాలతో కూడిన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తుందని భారత్‌జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలు ఓటర్ల బాధ్యత అనే అంశంపై సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మతవిద్వేశాలు రెచ్చగొట్టే భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకమైన పవనాలు వీస్తున్నాయని అన్నారు. ఎక్కువగా ఆశలు పెట్టుకున్న రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఓటర్ల నాడిని చూస్తే సగానికి పైగా సీట్లల్లో ఇండియా కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే తెలంగాణ ఓటర్లు ఒక్క నియంతనను తొలగించుకున్నారని, ఒక్కో నియంతన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. దేశ ప్రజలకు బీజేపీ యొక్క అసలురంగు అర్థమైందని అన్నారు. కార్యకర్తలు, ప్రజాస్వామ్య సంఘాల ప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి వాస్తవాలు ఏమిటి, అబద్దాలు ఏమిటి తెలియాలని కోరారు. సమావేశంలో డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, రైతు స్వరాజ్ జాతీయ నాయకులు కిరణ్, ప్రొఫెసర్ సుకుమార్, నర్రరామారావు, రామ్మోహన్‌రావు, షేక్‌హుస్సేన్, భాస్కర్, నర్సింలు, డాక్టర్ రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బైబిల్ పఠన తరగతులు



విద్యార్థులకు ప్రతిభ పత్రాలు అందజేస్తున్న పాస్టర్లు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 28: బర్దిపూర్ చర్చిలో వేసవికాల విరామ బైబిల్ పఠన తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం ముగిసింది. గత నాలుగు రోజులుగా బైబిల్ తరగతులు ప్రెసిబిటర్ ఇన్‌చార్జి జీడీసీసీ సండే స్కూల్ సెక్రటరీ రెవరెండ్ దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ తరగతుల్లో ప్రతిభ చూపిన వారికి ధృవీకరణపత్రాలు అందజేశారు. చిన్నారులు ఆట పాటలతో బైబిల్ వాక్యములను పఠించి అందరిని ఆకర్షించారు. కార్యక్రమంలో ప్రతినిధులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తుల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్28: మండంలోని బషీరాబాద్ కాడిచెరువులో కోలువై ఉన్న గంగపుత్రుల ఆరాధ్యదైవం గంగమ్మమాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వలగొడుగు ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పోచమ్మఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు గ్రామ ప్రధాన వీధులగుండా సాగుతూ చెరువు వద్దగల గంగమ్మమాత ఆలయానికి చేరుకుంది. ఊరేగింపులో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. మహిళలు, యువకుల కోలాటాలు ఊరేగింపులో ఆకర్షణగా నిలిచాయి. వలగొడుగు ఊరేగింపులో గంపుత్ర సంఘం అధ్యక్షుడు తోపారపు శివానంద్, ఉపాధ్యక్షుడు తోపారపు గంగారాం, సభ్యులు ముత్తన్న, మోహన్, శ్రీనివాస్, దినేష్, ముత్తన్న, పోషన్ననారాయణ, కమిటి సభ్యులు యువజన సంఘాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామ పురోహితులు జిమ్మెగారి అజయ్ శర్మ శ్రీ శివగంగాభవాణి కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం దేతామూర్తుల పల్లకీ సేవా కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.



పోచమ్మ బోనాలతో ఊరేగుతున్న గౌడ సంఘ సభ్యులు, మహిళలు

కమ్మర్‌పల్లిలో ఘనంగా పోచమ్మ బోనాల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 28: మండల కేంద్రం శివారులోని బ్రహ్మంగారి గుట్టపై దక్షినవైపు కొలువుదీరిన గౌడకులస్తుల ఆరాధ్య దైవం రేణుకా ఎల్లమ్మ ఆలయ ఐదో వార్షికోత్స మహోత్సవంలో భాగంగా మూడోరోజు ఆదివారం గ్రామగౌడ సంఘాల, యువజన సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి ఒక్కో ఇంటి నుంచి బోనాలతో స్థానిక భరతమాత విగ్రహంవద్దకు చేరుకోగా మధ్యాహ్నం మండుటెండను సైతం లెక్కచేయకుండా మహిళలు గ్రామంలో పోచమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ గౌడకుల సంఘం అధ్యక్షుడు సభ్యులు ఎం సుభాష్‌గౌడ్, సల్లూరి బాలగౌడ్, రాంపూర్ శంకర్ గౌడ్, ఇటిక్యాల దశా గౌడ్ సత్యపాల్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, గౌడ కులసంఘ సభ్యులు, గౌడసంఘ యువజన సంఘం సభ్యులు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. సోమవారం గంగాకటమయ్య బోనాలపట్ట నందు కార్యక్రమాలు ఉంటాయని, 30న ఉదయం 7గంటలకు ఎల్లమ్మ బోనాలు, ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో బోనాల ఊరేగింపులో పాల్గొనాలని కోరారు.



బషీరాబాద్‌లో వలగొడుగు ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై నిర్లక్ష్యమేలా?


భిక్కనూరు పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

- ఉమ్మడి భిక్కనూరులో పలుచోట్ల అసంపూర్తిగా పనులు
- నిధులు ఉన్నా పనులు చేయడంలో జాప్యం
- మరికొన్ని చోట్ల నిధుల మంజూరుకు ఎదురుచూపు
- పలు గ్రామాల్లో నిరుపయోగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు

భిక్కనూరు, ఏప్రిల్ 28: గత ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు వందశాతం సబ్సిడీతో డబుల్‌బెడ్ రూం ఇళ్లను అందించాలన్న ఉద్దేశ్యంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని 2015లో ప్రారంభించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా చాలా గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించి పలు గ్రామాల్లో అర్హులను గుర్తించి పంపిణీ చేయగా మరికొన్ని గ్రామాల్లో పూర్తి అయిన నిరుపయోగంగా ఉన్నాయి. ఈ డబుల్‌బెడ్ రూం ఇళ్లు పూర్తి అయినా అర్హులకు ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంతో అందులోని వస్తువులు, విద్యుత్, ఫ్లంబింగ్ సామాను చోరీకి గురవ్వడంతో పాటుగా అధ్వానంగా తయారవుతున్నాయి. కాగా పలు గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్న కొన్ని గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నిధులు ఉండగా మరికొన్నింటికీ నిధులు అవసరముంది. నిధులు ఉన్న వాటిల్లో అయినా అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉమ్మడి భిక్కనూరు మండలంలో తొమ్మిది చోట్ల భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి, బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, బాగిర్తిపల్లి, జంగంపల్లి, తలమడ్ల, రాజంపేటలో ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. వీటిలో బస్వాపూర్, బాగిర్తిపల్లి, జంగంపల్లి, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో అన్ని పనులు పూర్తి కాగా జంగం పల్లి, బాగిర్తిపల్లి గ్రామాల్లో అర్హులకు పంపిణీ చేశారు. మిగితా గ్రామాల్లో పంపిణీ చేయలేదు. భిక్కనూరు, కాచాపూర్, రాజంపేట, తలమడ్ల, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి.

నిధులు ఉన్నా పనులు చేయడంలో జాప్యం

ఉమ్మడి భిక్కనూరులోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి నిధులు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడం లేదు. అధికారులు సైతం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. భిక్కనూరులోని 44వ జాతీయ రహదారి పక్కన నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి రూ.50లక్షల నిధులు ఉండగా ఇందులో ఇప్పటి వరకు రూ.20లక్షలకు పైగా నిధులతో సీసీ డ్రైనేజీ, విద్యుత్, నీటి ట్యాంకులు, లోపలి పనులను పూర్తి చేశారు. మిగితా నిధులతో సీసీ రోడ్లు, వీటిలో పాడైనా, చోరీకి గురైనా విద్యుత్, ఫ్లంబింగ్ పనులు, నీటికి సంబంధించిన పనులు చేయాల్సి ఉంది. కాగా సీసీ రోడ్లకే ఇందులో రూ.15లక్షల వరకు సీసీ రోడ్లకే అవసరముంటుందని అధికారుల అంచనా. అసంపూర్తిగా ఉన్న డబుల్ ఇళ్లు పూర్తి చేయకపోవడంతో మందు బాబులకు అడ్డాలుగా, అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయి.

ఉమ్మడి భిక్కనూరులో తొమ్మిది గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

- సోహెల్, పంచాయతీరాజ్ ఏఈ

ఉమ్మడి భిక్కనూరు మండలంలో భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి, బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, బాగిర్తిపల్లి, జంగంపల్లి, తమలడ్ల, రాజంపేటలో ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయి. వీటిలో బస్వాపూర్, బాగిర్తిపల్లి, జంగంపల్లి, పెద్దమల్లారెడ్డిలో పూర్తికాగా తలమడ్లలో 10 శాతం పనులు, రామేశ్వర్‌పల్లిలో నీటి కనెక్షన్ పనులు చేయాల్సి ఉంది. భిక్కనూరు పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నిధులు ఉన్నాయి. త్వరలోనే ఇందులో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగింది. రాజంపేట, కాచాపూర్ గ్రామాలకు సంబంధించి కేవలం బిల్డింగ్ పనులకు మాత్రమే నిధులు మంజూరు కాగా బిల్డింగ్ పనులు పూర్తి చేయడం జరిగింది. మిగితా పనులకు సంబంధించి నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం.


రాజంపేటలో..

మరికొన్ని చోట్ల నిధుల మంజూరుకు ఎదురుచూపు

ఉమ్మడి భిక్కనూరు మండలంలోని రాజంపేట, కాచాపూర్ గ్రామాల్లో బిల్డింగ్‌లు మాత్రమే పూర్తికాగా విద్యుత్, ఫ్లంబింగ్, డ్రైనేజీ, నీటి వసతి, తదితర పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రాజంపేటలో ఈ పనులు పూర్తి కావడానికి దాదాపుగా రూ.60లక్షల వరకు, కాచాపూర్ గ్రామంలో దాదాపుగా రూ.40లక్షల వరకు నిధులు అవసరముంటాయని పంచాయతీరాజ్ అధికారుల అంచనా. తలమడ్ల గ్రామంలో దాదాపుగా 90శాతం పనులు పూర్తి కాగా మరో 10శాతం పనులు జరగాల్సి ఉంది. రామేశ్వర్‌పల్లి గ్రామంలో పనులు పూర్తి అయినప్పటికీ నీటి సమస్య, సెప్టిక్ ట్యాంక్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వర్షాకాలంలో ఈ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఒకవేళ పక్కనే ఉన్న బొబ్బిలి చెరువు నిండితే వీటి చుట్టూ అంతా నీరు చేరుతుంది.

పలుచోట్ల పూర్తి అయిన పంపిణీ చేయడం లేదు

ఉమ్మడి భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, తలమడ్ల, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో డబుల్‌బెడ్ రూం ఇళ్లు పూర్తి అయినా అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికీ పంపిణీ చేయలేదు. దీంతో ఆ డబుల్‌బెడ్ రూం ఇళ్లు అధ్వానంగా పిచ్చిచెట్లు మొలకెత్తి అసాంఘిక కార్యకలపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో అధికారులు అధికారికంగా పంపిణీ చేయకపోవడంతో గ్రామానికి చెందిన పలువురు అందులోనే నివాసముంటున్నారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి బస్వాపూర్ గ్రామాల్లో ఇది వరకు ఆయా గ్రామాలకు చెందిన కొందరు డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి సామాన్లతో వచ్చి పూజలు నిర్వహించడం, గదులకు తాళాలు వేసుకున్న సంఘటనలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో వారిని డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఖాళీ చేయించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు వెంటనే పంపిణీ చేయాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్

విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్‌ల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకముందే ముందస్తు అడ్మిషన్ల పేరిట విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు సరిచంద్, జిల్లా నాయకులు నవీన్, సుశీల్, మహేష్, రాందాస్, బాలాజీ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.


వైకుంఠ రథాన్ని అందజేస్తున్న దృశ్యం

వైకుంఠ రథం అందజేత

సదాశివనగర్, ఏప్రిల్ 28: సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ సామల రాజేశ్వర్‌రెడ్డి రూ.2.50 లక్షలతో గ్రామానికి వైకుంఠ రథం అందించారు. తన తండ్రి సామల ఆశన్న జ్ఞాపకార్థం వైకుంఠ రథం అందించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బాలరాజిరెడ్డి, జనార్థన్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఖలీల్

మే డేను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 28 : కార్మికులంతా సంఘటితంగా ఉంటూ మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 44 చట్టాలను నాలుగు కోడ్లుగా విభజన చేసి కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. కార్మికులంతా ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పోరాటాల ద్వారా నాలుగు కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. జిల్లాలోని కార్మికులందరూ కలిసి మేడేను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జిగారి సాయిలు, రాజు, విఠల్, శివరాజు తదితరులున్నారు.

చిత్తు బొత్తు స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28: రాజంపేట మండలం తలమడ్ల గ్రామ శివారులో చిత్తుబొత్తు ఆడుతున్న స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ సింధూ శర్మ తెలిపారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.6060 నగదు, 6 మోటార్ సైకిళ్లు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అందించినట్లు తెలిపారు. చాలా మంది పేదలు ఈ ఆటలో పాల్గొని తమ డబ్బులు పోగొట్టుకుంటున్నారని ఇంట్లో వారిని సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.

రైలు కింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

భిక్కనూరు, ఏప్రిల్ 28: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శామర్తి బాలమణి(61) అక్కన్నపేట్-తిప్పాపూర్ రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈ ప్రమాదంలో వృద్ధురాలి శరీరం గుర్తుపట్టని విధంగా మారిందన్నారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి భర్త బలరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

దామరంచలో అడ్డగోలుగా మొరం తవ్వకాలు


దామరంచలో పట్టుబడిన టిప్పర్లు

బీర్కూర్, ఏప్రిల్ 28: మండలంలోని దామరంచ గ్రామ శివారులో గత కొన్ని రోజులుగా అడ్డగోలుగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికారులు స్థానికంగా ఉండకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. వారి అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమార్కులు మొరం తవ్వకాలు చేపడుతున్నారు. జేసీబీ సహాయంతో మొరం తవ్వకాలు చేపడితే టిప్పర్లలో లోడు చేసి బాన్సువాడకు దూర ప్రాంతాలకు దర్జాగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం కూడా పదుల సంఖ్యలో టిప్పర్లను రప్పించారు. జేసీబీ సహాయంతో తవ్వకాలు చేపడుతూ మొరాన్ని టిప్పర్లలో లోడ్ చేసి తరలిస్తున్నారు. స్థానిక ప్రజలు, అధికారులుక సమాచారం అందించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అక్కడికి చేరుకుని మూడు టిప్పర్లను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం టిప్పర్లను బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


దళిత సమ్మేళనంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

పిట్లం. ఏప్రిల్ 28: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం పిట్లంలో బీజేపీ ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో దళిత సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగా రాగా బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఘనంగా సత్కరించారు. అనంతరం మందకృష్ణ సభను ఉద్దేశించి మాట్లాడుతూ తాను బీజేపీకి కేవలం మద్దతుదారుడను కానీ నేను బీజేపీ వ్యక్తిని కాదని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓడించడానికి బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. రాహల్‌గాంధీ, సోనియా గాంధీని ఎస్సీ వర్గీకరణ కోసం బిల్లు పెట్టమని పలుమార్లు కలిసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు అధికారంలోని రిజర్వేషన్లు అమలు చేయని వారు భవిష్యత్‌లో అమలు చేస్తారనుకోవడం అమాయకత్వం అన్నారు. ఎస్సీల వర్గీకరణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్థిక అసమానత, సామాజిక న్యాయం జరగాలంటే జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ రెండు సార్లు గెలిపించిన ఓటర్లు మరోమారు ఆశీర్వదిస్తే జహీరాబాద్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కేంద్రంలో మరోమారు రాబోయేది బీజేపీ ప్రభుత్వం అని, తనను గెలిపిస్తే జాతీయ రహదారులు, రైల్వేలైన్‌లు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగారాం, మండల అధ్యక్షుడు అభినయ్‌రెడ్డి, నాయకులు జగదీష్, అశోక్‌రాజ్, వడ్ల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం కాటుకు బలవుతున్న కంటి చూపు



బాన్సువాడ ఏప్రిల్ 28: జ్ఞానేంద్రియానం నయనం ప్రధానం అంటే జ్ఞానేంద్రియాల్లో కంటి చూపే ప్రధానమైంది. అత్యంత ప్రధానంగా భావించే కన్ను వాతావరణ కాలుష్యంతో ప్రమాదంలో పడుతోంది. వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యం కంటిని కాటేయ బోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాహనాల వల్లనో, సిగరేట్లు కాల్చడం వల్లనో వచ్చే, మస్కిటో కాయల్స్ కాల్చడం వల్లనో, విడుదలయ్యే పొగ కంటి చూపును దెబ్బ తీస్తోంది. మనం ఇండ్లలో దోమల నివారణకు వాడే లిక్విడ్, కాయిల్స్ నుంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్ ప్రమాదకరమైంది. గదిలో తలుపులన్నీ మూసేసి కాయిల్స్ వాడటం వల్ల వాటి నుంచి వెలువడే పొగవల్ల పిల్లలకు అస్తమా, శ్వాసకోశ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సిగరెట్‌తో పొంచి ఉన్న ప్రమాదం

సిగరెట్ పొగలో 400 వరకు రకరకాల రసాయనాలు ఉంటాయి. ఇవి రక్త సరఫరా మీద ప్రభావం చూపుతాయి. గుండె ఊపిరి తిత్తులతో పాటు కంటిలోని రెటినా, కార్నియ పొరలపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి. సిగరెట్ పొగలో ఉంటే అలర్‌డ్రిన్ అనే ఒక రకమైన విష వాయువు కంటిలోని నల్ల గుడ్డు మీద ఉండే కణజాలాన్ని దెబ్బతీస్తోంది. దీంతో చూపు మందగించడమే కాకుండా కంటి చూపు కూడా పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సిగరెట్ తాగడం వల్ల వచ్చే మస్కులర్ డీ జనరేషన్ అనే వ్యాధి ఒక కంటికి గనక సోకితే దాని ప్రభావం వల్ల రెండవ కన్ను చూపు కూడా పోయే ప్రమాదం ఉందని నేత్ర వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాయిల్స్‌తో వచ్చే తంటాలు

దోమల నివారణకు మనం వినియోగించే మస్కిటో కాయిల్స్ దోమలను నివారించటమేమో గాని శ్వాస సంబంధ రోగాలను తెస్తాయని వైద్యులు అంటున్నారు. మస్కిటో, కాయిల్స్, లిక్విడ్స్ నుంచి వెలువడే వాయువు వల్ల ఊపిరి తిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులంటున్నారు. వీటి వల్ల చిన్న పిల్లలకు అస్తమా వచ్చే అవకాశం ఉందంటున్నారు. అంతే కాకుండా కంటి చూపుకూడా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. వాహనాల వల్ల వెలువడే పొగ వల్ల కలిగే కాలుష్యంతో కంటి కణజాలాలు దెబ్బ తినడంతో పాటు క్రమేణ కంటి చూపు కూడా తగ్గుతుందని వైద్యులు అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కాలుష్యం వల్ల కంటికి కలిగే ప్రమాదాలను తగు జాగ్రత్తలతో మనం నివారించవచ్చు.
- దోమల నివారణకు మస్కిటో కాయిల్స్, లిక్విడ్స్‌కు బదులు దోమ తెరలను వాడటం మంచిది.
- తప్పని పరిస్థితుల్లో కాయిల్స్‌ను, లిక్విడ్స్‌లను సాధ్యమైనంత తక్కువగా వాడాలి.
- ఎలక్ట్రానిక్ బ్యాట్‌లను వినియోగించవచ్చు.
- ధూమపానం చేసే వారికి దూరంగా ఉండాలి
- కంటి పరీక్షలు నిర్వహించుకుంటూ ఉండాలి
- వాహనాలపై వెళ్లే టప్పుడు హెల్మెట్ (ముందు గ్లాసు ఉండేవి) వాడటం మంచిది. లేదంటే కంటి అద్దాలు వాడాలి.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి


శ్రీనివాస్‌గౌడ్(ఫైల్)

తాడ్వాయి, ఏప్రిల్ 28: తాడ్వాయి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ తాళ్ల పల్లి శ్రీనివాస్‌గౌడ్(50) శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విధులు నిర్వహించడం కోసం తన కారులో రాత్రి 11గంటల 45 నిమిషాలకు ఇంటి నుంచి బయలుదేరారు. తాడ్వాయి శివారులోకి రాగానే కెనాల్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు ఆయనను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే వైద్యులు మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా పార్కింగ్ చేయడంతోనే లారీని ఢీకొట్టుకుని హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందినట్లు ఏఎస్ సంజీవ్ తెలిపారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాంధారి వంతెన సమీపంలో గుర్తు తెలియని శవం లభ్యం

గాంధారి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలో గల వంతెన సమీపంలో పాడుబడ్డ బావిలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపేసి గోనె సంచిలో కట్టి బావిలో పడేసినట్లు తెలిపారు. ఇటీవల మిస్సైన గాంధారికి చెందిన బుర్రి కీర్తనగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	- మనజుమిల్ బాయ్స్
శాంతి	- టిల్లు స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి	- గీతాంజలి
వెంకటేశ్వర	- రత్నం



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

